# అబద్ధంలో నిజం

సుశీల కొళాయికి వెళ్లినపుడల్లా, వచ్చినపుడల్లా వాడు "అమ్మగారూ! నమస్కారం!" అనడం ఆమెకి దిగ్భ్రాంతి కలిగించింది మొదట్లో. ప్రక్క మరెవరికో పెడుతున్నాడు కామోలు ననుకుంది గాని, రోజూ యిదేవాటం కావటంచేత అనుమానించింది. అయినా తనుచూస్తే యిరవైఏళ్ళు నిండ నిది. అతడుచూస్తే 40 ఏళ్ళ మనిషి.

ఎందుకు చెప్మా, యిలాగంటాడని అతనివైపు చూడాలని అనిపించకపోయినా యథాలాపంగా అనుకోకండా చూసే సరికి వాడు మీసాలకి రంగు రాసుగున్నట్టు, ఆ మీసాలు ఉడతతోకల్లా వున్నట్లు, మనిషి అంత మంచివాడుకానట్టు అనిపించింది ఆవిడకి. మాటాడకండా తనదారిని తాను పోతూంది, అటువయిపయినా చూడకండా.

వెధవది ఆకొళాయికి అఘోరించడానికి అదొక్కటే దారామె! తప్పదు! ఎలా? ఎవరి చాతనయినా పోయించు కుందికి ముసలి అత్తగారికి 'మడి' చెల్లదు. ఏందారి? అయినా ఇంతలో ఏంపోయింది? వాడిఉద్దేశ్యం ఏమయి వుంటుందీ?

అమ్మగారూ అంటున్నాడే కాని, ఆ అనడంలో సదుద్దేశ్యం ఉన్నట్టులేదు. అనుకోనీ-తనకేం? తన మానాన్ని తను తనను కాదనుకొని పోతేసరి! నాలుగుసార్లు అనుకొని వాడే వూరుకుంటాడు అనుకుందామె.

ఇలా రోజులు గడుస్తున్నాయి. ఆ మీసాలరాయుడు రానురాను క్రోరచూపులు చూస్తోండడం, యీమె రాకకోసం యివతల దేవులాడడం ఎక్కువయింది. సుశీలకి ప్రాణసంకటంగా మారింది.

ఈ విషయం భర్తతో చెప్పాలనుకుంది కాని– "యీపాటిదానికే ఎందుకు? మన నేంచేస్తాడేం? భర్తతో నేగాని తొందరపడి చెబితే. ఏమో? ఏమనుకుంటాడో? లేక అతడితో తగువుకి దిగితే–ఇంకేమయినా వుందీ? అనవసరంగా వీధిలో పడాలి! అయినా యిలాటి విషయాలు ఏమని చెప్పాలి? చెబితే రచ్చకెక్కడం, తంటాలూ, అంతాఅయేక ఋజువేదీ? వాడు దబాయిస్తే మనకే అవమానం! ఆడది ఎలా ఋజూచేసుకోగలదూ తన నిర్దోషిత్వం? కాని పొరపాటు చేసిందంటే– దానంతటదే ఋవువయిపోతుంది.

అంతటితో అవునా? ఆ కోపాలుంచుకొని, ఒకదానికొక టేం జరుగుతుందో! వాడు చూస్తే రౌడీ వెధవలాగున్నాడు. ఎటొచ్చి ఏంచేసినా, తన భర్తకి, తమకి అక్కడ దిక్కెవ్వరు?

ఈ విధంగా సుశీల తనలో ఆలోచించుకొనేసరికి ఆమెకి– గొప్ప భయం ప్రవేశించింది– లోలోనే బాధపడసాగింది. పైకి ఎవరితో చెప్పడానికీ ధైర్యం చాలలేదు.

మీసాలరాయుడు అసలుపేరు "వీరినాయుడు". అతను చేసిన ఘనకార్యాలు ఏమీ లేకపోయినా, అతని విగ్రహం గంభీరంగా వుంటుంది. చూసేవారికి ఏదో హృదయం కలుక్కుమంటుంది. భయంవేసినట్టవుతుంది. అతని మీసాల

సొగసు, మనిషి ఒడ్డూ పొడుగూ చూసి మీసాలరాయుడనే పేరు సార్థకం చేశారు. పనీపాటా లేకపోయినా ఆవూరిలో ఎక్కడ చూసినా మీసాలు కీటుకుంటూ యితడే కాన వస్తాడు. మర్రిచెట్లక్రిందా, కిళ్లీలకొట్లూ చిన్నరకం కాఫీ క్లబ్బుల దగ్గరా, రైల్వే ప్లాట్‌ఫారంమీదా తరచూ కనబడు తూంటాడు. ఆడవాళ్ళవయిపు అతడు చూసేచూపుకు అభి మానంగల ఏ ఆడదీ ఎదుట పడదు. ఊరిలో రౌడీ అని పేరు పడ్డ వీరినాయుడు సుశీలమీద కన్ను వేశాడు.

ఒకనాడు—

ఆమె, ప్రక్కయింటివాళ్ళు కలిసి, ఎవరింటికో పేరం టానికి పోతుండగా వాడు ఒక వరండాలో కూర్చుని—

"రండి... రండి... యిలా కూర్చోండి... అలా వెళ్లి పోతారేం? లోపలికిరండి!..." అని వెధవనవ్వు— పోకిరీ నవ్వు— నవ్వుతూ ఆహ్వానించడం చూసి, వీళ్ళకి ముచ్చెమ టలూ పోసేశాయి. కాళ్లాడలేదు. కళ్ళు పచ్చబడి వెనక్కి తిరక్కుండా బిక్కమొహాలతో ఇళ్ళకొచ్చి పడ్డారు. ఇళ్ళలో క్షేమంగా చేరాక గుండెలు పట్టుగొని, ఒకళ్ళ మొహాలొకళ్లు చూసుకొని "బ్రతికాం" అనుకొన్నారు.

"అవునే ! ఎందుకలా అన్నాడు!"

"మన్నికాదేమో, భయపడ్డాం వుత్తినే!"

"కాకపోడం ఏమిటే? ఖచ్చితంగా మనవైపు చూసి పిలుస్తుంటేనూ ? వాడికేం పోయేకాలమోను ?"

"వాడు మంచివాడిలా కనబడలే...... ఎప్పుడూ యింతే."

"అవునే... నన్ను చూసినా వాడలానే ఎప్పుడూ ఏదో ఒకటి అంటూంటే, నన్నొక్కర్తినే అనుకున్నా..."

"లేదమ్మా... వాడి గుణమే అంతలాగుంది! అటు పయిపు వెళ్ళడానికి భయం... తప్పదు–ఖర్మ!"

"ఇలా వూరుకుంటే లాభంలేదు. అందరితోనూ ఒక్క లాగే వున్నాడు. ఇవాళ యిదయింది రేపు మరోటవుతుంది."

"ఏంచేస్తాం! వాడికి మనయీడుగలఆడపిల్ల లున్నారు కదా! వెధవకి బుద్ధివుండక్కర్లా?"

"ఇలా పలకరించడం, ఎవరికంటయినా పడితే వీడికీ, దానికీ, ఏసంబంధం లేకపోతే అంతధైర్యంగా ఎలా పలకరించగలడూ?" అని అనుకుంటారు. ఆతర్వాత లేనిపోనివన్నీ వచ్చి యిళ్ళదాకా తెలిసి ప్రాణంమీదికి వస్తుంది."

"అయితే యేంచేద్దాం! యేంచేయగలం?"

"—మొహంముదే– ఏమిటి సంగతి? నీ మనసులోకి యేమనుకున్నావు? మర్యాదగావుండు. లేకపోతే మావాళ్ళకు చెబుతాం" అని చెప్పుదీసి కొట్టినట్టు అడిగేద్దాం. అక్కడితో కుదురుతుంది."

"అమ్మయ్యో! ఆ దుర్మార్గుడితో మాటాడ్డంవే! అలా మాటాడితే, అలుసయిపోతాం. అంచేత చల్లగా వాడి పెళ్ళాంతో యీసంగతిచెప్పి, నీమొగుణ్ణి అదుపులోపెట్టు. లేకపోతే మొగాళ్ళవరకూ వెళుతుంది అని చెబుతేనో?"

"అదో మాస్తరు బాగానేవుంది."

"లేకపోతే మనవాళ్ళతోనే చెబుదాం!"

"వద్దొద్దు. ఇల్లాంటివిగాని మొగాళ్ళకి తెలిస్తే కొట్టు కోడంవరకూ వచ్చి, నానా అల్లరీ అవుతుంది. ఈమాత్రం దాన్ని గోళ్ళతో ఆపాలిగాని గొడ్డలితోనా!"

"అంతగా ముదిరితే అప్పు డెలాగూ తప్పదు."

ఈరకంగా తలోవిధంగా అనుకొని, వాడి దృష్టిలో పడింది. తనొక్కర్తేకాక మిగతావారుకూడ వున్నారని కాస్త ధైర్యంపడ్డారు ఒకొక్కరు తమలో. కాని యిదిఎంతవరకు వెళుతుందో అని బెంగపడుతూనే వున్నారు.

సుశీలకుమాత్రం ఆదినం నిద్రపట్టలేదు. తిండి సహించ లేదు. మనసులో యుద్ధం ప్రారంభం అయింది. ఏమంటే ఎన్నాళ్ళనుండో, భర్తతో యీవిషయం చెప్పాలనే ఆత్రుత ఆమెలో వుంది. ఇన్నాళ్ళవరకు, ఎంతో నిర్బంధంమీద అణచి పెట్టుకుంది. హృదయం బరువెక్కిపోయి ఆఖరికి ఏడ్చే సింది. ఉండలేక భర్తతో చెప్పే ధైర్యం చాలక అత్తే గారితో చెప్పేసింది. అత్తగారు ఆలోచించి, కొడుకుతో యింత చిన్నవిషయం చెప్పనవసరంలేదని సలహాయిచ్చింది. అక్కడినుండి కోడలిని కొళాయి దగ్గరికి పంపడంమాని, అతి కష్టంమీద తనేవెళుతూ వస్తుండేది. కాని ఎన్నాళ్ళు అలా తేగలదు? శక్తిలేదు. అంచేత, మళ్ళీ ఆమె వెళ్ళక తప్పలేదు.

కొన్నాళ్ళు సుశీల అటు వెళ్ళకపోయేసరికి మనవాడు నిరాశచెంది ఊరుకున్నాడు. కాని అకస్మాత్తుగా తిరిగి యీమె

దర్శనం అయేసరికి వెకిలిచేష్టలు ప్రారంభించేడు. ఇన్నాళ్ళు వీడు కనబడకపోడం నించి ఆమెకి గుండె దిట్టపడింది. గాని తిరగి ఆవాసన తగిలేసరికి పిడుగు నెత్తిమీద పడ్డట్టయి చికాకుగా వెళ్ళిపోయింది. మళ్ళీ ఆమెలో దిగులు, బెంగ ఎక్కువైనాయి. తిరిగి మొగుడితో చెప్పడమా, వద్దా అని తర్కం ప్రవేశించింది. చెబితే పర్యవసానం ఏమని ఒక బెంగ. చెప్పక ఊరుకుంటే ఏదిఎలా వచ్చినా, తెలిసేక యింతవరకు ఎవరితోనూ ఎందుకు చెప్పలేదు అని అంటారేమో?

సహనం, ఓర్పు అవసరమేగాని, అది చేటుతెచ్చే స్థితికి వచ్చేవరకూ ఉపేక్షిస్తే కొంప మునుగుతుంది. విషయాన్నిబట్టి, పరిస్థితిని, మనుషుల్ని, వాతావరణాన్నిబట్టి అదివుండాలి. తప్పుచేసినదానికైతే భయంగాని, తనకేం? పౌరుషంపడి, యిలాటి స్వల్పవిషయం ఎత్తి, అనుమానంలేని తనభర్తకి అనుమానం కలిగించడం దేనికీఅని సందేహిస్తూంది.

మరోనాటి సంఘటన—

సుశీల కొళాయినుండి నీళ్ళుతెస్తూంది. చంకలో బిందె పెట్టుకొని సూర్యుని లేతఎండ వెలుగుల్లో ఆమెను చూస్తోంటే ఏ అజంతాకన్యో నడచినట్టుంది. వస్తూ వస్తూ, యీహోట్లు దగ్గరికి రాగానే, మన మీసాలరాయుడు అతివినయంగా వచ్చి—

"ఆ బిందెనీళ్ళు కాస్త దింపుకొని మరీ వెళ్ళరాదూ? మరీ అలసినట్టున్నావు. దింపనా?" అని అన్నారు.

అంత అమర్యాదగా అంటున్నవాడిని చూడగానే ఆమెకి అసహ్యంవేసింది. ఇంక సహించలేకపోయింది. బాగా

బుద్ధిచెప్పదలచుకొని ఒక్కసారిగా వెనక్కితిరిగి, వాడిని ఉద్దే శించి "ఛీ-పో—నాతో మాటలేమిటి నీకు? ఎందుకలా పలక రిస్తావు ? బుద్ధిలేదూ ! ఈసారి నాజోలెత్తావా మర్యాద దక్కదు" అని అనేసి గబగబా వెళ్ళిపోతూ దూరంగా వస్తున్న తనభర్త చూశాడా ? చూసేవుంటాడు. ఏమను కున్నాడో? అనుమానిస్తాడో ఏమో? ఏమిటీ ఖర్మ!"

అని ఆ బెంగలో గాభరాలో, బిందెక్రింద పడిపోగా వళ్ళంతా బురదత్రుళ్ళి పాడైంది. అక్కడనుండి చైతన్యం లేకుండా బిందెపట్టుకు గబగబా యింటికి వచ్చేసి మంచం మీదపడి ఏడ్వడం మొదలెట్టింది. మామూలుగా అయితే ఏమోగాని ఆమెకు ఆరుమాసాలు.

భర్తవస్తే జరిగిందంతా యింక దాచకండా చెప్పేసి క్షమించమందామని అనుకుంది. కాని భర్త అంత వేగిరం రాలేదు. ఆమెకి మరింత భయమైంది.

చాలా సేపైనాక భర్తవచ్చేడుగానీ, మామూలుగానే వున్నాడు. ఆమె నేమీ అనలేదు. అనుమానించినట్లయినా లేదు. అతనివైఖరి చూసేక ఆమెకి కొంచెం ధైర్యం కలిగింది బహుశా ఆయన చూడలేదేమో అని అనుకుంది.

చూస్తేమాత్రం ఏం? తనేం తప్పుచేసిందా? నిజంచెబు తుంది. దాచవలసినఖర్మ తన కేం? అప్పుడే అన్నీబయటకొచ్చి, యీ లోలోపల కుళ్ళడం తప్పుతుంది అని అనుకుంది. అయినా అనవసరంగా, నిర్మలమైన మనసు నెందుకు పాడు చేయడం? అంతా తన భయమేగాని, ఏంజరిగింది గనక అంత

చెప్పేపాటి అని తిరిగి ఆప్రూసు ఎత్తకంపా గుట్టుగా వూరు కుంది.

ఇలాటి పొరపాట్లే ఆడవాళ్ళు చేస్తూంటారు అమాయకంగా.

ఆమె గ్రహపాటో ఏమిటోగాని — ఆమీసాల రాయుడు యీమెనిలా పలకరించడం—కొందరి 'నారదుల' కంట పడనేపడింది. గుసగుస లెక్కువై, చిలవలై పలవలై అన్నీ కలిసి మరోలా తయారై "ఆమె" కళంకం తప్పలేదు. దానికితోడు యీమెకి ఆరోనెల అవడం మరీ అనుమానానికి అనువైంది. చాటుగా అనుకొనేవాళ్లు వినీవినబడనట్టు అనడం, తర్వాత బహిరంగంగా చెప్పుకోడం మొదలైంది.

ఆ మీసాలరాయుడికీ, యీమెకీ, సంబంధం వున్నట్టు ఊహాపోహా ప్రచారాలు ఆరంభించేయి. అందులో ఆశ్చర్యం ఏమిటంటే పూర్వం తనతోసహా పరాభవింపబడ్డ యిరుగు పొరుగు ఆడవాళ్ళే, తెలిసివుండీ బుగ్గలు నొక్కు పెట్టుగుంటున్నారంటే-యింకేముంది?

"అయ్యో! ఎలా తిరగ్గలుస్తూందే! ఆపాపం మోసుగుంటూ నలుగుర్లోనూ ఏమీ ఎరగనట్టు—"

"అయినా అందుకే అంటారు! 'బిడ్డచాటు కంపు మొగుడుచాటు రంకు' అని. అన్నీ చెల్లుతాయి. ఏం కాలం వచ్చిందమ్మా!"

"ఏనాడో అనుకోలేదటే-వాడికీ దీనికీ వుందని! అదే గాని మంచిదయితే ఏనాడో పళ్ళు రాలగొట్టించి, బుద్ధి చెప్పించివుండును!"

"అయ్యో! నే చూస్తేనే వాళ్ళ పకపకలూ, ఆవీని. రోజూ ఏదోఒకటి పోట్లాలు కొళాయికి రానూపోనూ అంది స్తూనే వుంటాడు."

"దాని మొగుడికి తెలియదంటావా?"

"తెలీకేం? వాడొత్తి చవటగాకపోతే. దాన్నినరికి పారెయ్యక, యిలా ఊరుకుంటాడా?"

ఈరకంగా-సుశీల నలుగురిలోనూ తలెత్తి తిరగ లేనట్టుగా. దుమారం, దుష్ప్రచారం, ఆవీధిలో రేగింది. ఇంక ఆమె కంటికీ, మంటికీ ఏడుస్తూ యింటినుంచి పైకిరాలేక ఎలాగైనా, యీదుర్గతినుండి తప్పించమని, భగవంతుణ్ణి ప్రార్థించడంతప్ప యింకేం చేయలేక పోయింది.

ఇది యిలావుండగా, ఆమెకి భర్తప్రవర్తన వింతగా తోచింది, ఇంత గగ్గోలు ఎత్తిపోతున్నా ఆయనకు తెలియకుండా వుంటుదా? మరి తెలిస్తే ఏమీ వులకడు, పలకడు. ఇంట్లో ఏమీ ఎవరినీ అనడు. కనీసం అడగనైనా అడగడు. అనుమానించి నట్టయినా అవుపడడు. ఏమిటో మన స్తత్వం? ఏమని అనుకోడం.

కాని అంత నిశ్చలంగా, ఆమె మాత్రం వుండలేక పోయింది. రానురాను క్షీణించి పోతూంది. ఉత్సాహం చచ్చింది, మంచం ఎక్కడమే తరవాయి.

ఏం చెప్పగలదు మొగుడితో. ఏంచెప్పి తన మనో వ్యాధిని మాన్పుకోగలదు? సరిఅయిన సమయంలో అవ కాశం దొరికినపుడు, చెప్పడంమాని, చేయిదాటాక చెప్పి ఏంలాభం? చెబితేమాత్రం వింటాడా? అందరిమాటలూ విని,

'యింక ఏం అంటే ఏంలాభం?' అని వూరుకున్నాడేమో? ఛీ! యింతకన్న చస్తేనయం అని తలపోస్తూంది.

కాని ఎందుకు చావాలి? తాను చేసిన పాపం ఏమిటి? చస్తే తనమీాదనున్న యీఘోరాపవాదం, అలాగే వుండి పోదా! ఏం జరిగినాసరే ఇది అన్యాయమని, తను అమాయకురాలని, అందరికీ నిరూపించాలి. ఎలా? దానికి దైవమే సహాయపడాలి. అంతే. తనకేం స్వతంత్రవుంది గనుక ఏమి చేయగలదు? ఒకరిచాటున బ్రతికే వాళ్ళకి ఇంకేం ఆధారం ?

ఒకనాడు తలవనితలంపుగా తమ యింటికి ఆ మీాసాల రాయుడి పెళ్ళాం వచ్చేసరికి ఆమెకి ఆశ్చర్యం, మహాకోపం కలిగింది! ఒళ్ళు మండుతున్నా మర్యాదగానే ఆహ్వానించింది. కాని ఆవిడ ఎలావచ్చిందీ! వచ్చీరావడంతోనే జువ్వలా లేచింది. వూరంత నోరుపెట్టి అభినయంచేస్తూ.

"ఇదేమన్నా బావుందా? మేం ఎవరమనుకున్నారు మీాయింట్లో ఆడపిల్లల్లేరా? మీా ఆయనకి అప్పచెల్లెళ్ళులేరా? ఆయనకొచ్చిన ఏళ్ళు ఎవరికొచ్చాయి. ఏమో మర్యాదగల వాళ్ళనుకున్నాం. మా వంశంమర్యాదా ఏమనుకున్నారు?

ఈ రకంగా అందుకొని పోతూంది.

ఇంక యీామె, యీామె అత్తగారూ నోళ్ళు నెరుచుకొని ఏమిటో యీ ప్రళయం అర్థంగాక ... ఆపలేక ...

"ఏమమ్మా ఏమిటయింది !" అని అడిగారు.

"ఇంకా ఏమయింది అని అడుగుతున్నారా ? తెలియనట్టు. మీాయింటివాళ్ళని కొంచెం అదుపులోపెట్టండి !" అంది.

"ఎవళ్ళని" అడిగేరు.

"మీ యింటి మొగాళ్ళని... ఎందుకలా మా ఇంటి చుట్టూ తిరుగుతాడు? అదేం సానికొంపా, సంసారులకొంపా? మర్యాదకి ఆలోచించి, మీతో ముందే చెబుతున్నా... లేక పోతే ఏనాడో తగినబుద్ధి చెబుదుం!" అంది రోషంగా—

"ఇంతకీ ఏమయింది?"

"ఏమవడం ? మా పిల్ల వేపే చూస్తాడు. ఏమను కున్నాడో? ఆడపిల్లలుండరా? ఈసారి జరిగిందంటే– మొగాళ్ళ వరకూ వెడుతుంది."

ఇదివిని, ఇద్దరూ ఏం తోచక, నమ్మలేక, ఆశ్చర్య పోయినారు...'సుశీల భర్త' అలాటిమనిషి కాడు. అయినా ఏమోఅని అనుకున్నారు కాని. ఆమె అత్తగారు అందు కొని—

"అమ్మా! ఆముక్కే– మేమూ నిన్ను అడగొచ్చా?" అని అడిగింది.

"ఏమిటేమిటీ? తిరిగి అటుంచి యిటా? ఏమిటాఅడిగేది?"

"మా కోడలు కొళాయికి వెళ్ళి వచ్చేప్పుడు ఎందుకలా మీ ఆయన గింజుకుంటాడు ? దానివల్ల మేం యిప్పుడు మొహం ఎత్తుకు తిరగలేక పోతున్నామే?"

"ఏదో కారణం మామీదపెట్టి తప్పుకుందామనా? ఆయన అలాంటివారు కాదు. అయినా మీ కోడలికి బుద్ధి వుండాలిగాని, మగాళ్ళ కేం?"

"అదిగలాగే... మీ పిల్లకి బుద్ధివుండాలిగాని, మా వాడేం చేయగలడు? ఇంత తెగించి, మంచీ, చెడ్డా

ఆలోచించకుండా, ఏ మొహం పెట్టు గడగడానికి వచ్చేవు? మీ ఆయనకి పుట్టగతులుంటాయా? ఎన్నిసార్లు ముఖంముందు చివాట్లు పెట్టినా కుక్కలా అదే వరసా? మేం మొగాళ్ళతో చెప్పలేకే వూరుకున్నామా? వెళ్ళు వెళ్ళు. చాలు చాలు!" అని ఆమె అత్తగారనగానే—

అంత జోరుగా వచ్చినమనిషి చల్లబడి నెత్తిమీద చేతులుంచుగొని, కూలబడిపోయి, విచిత్రంగా—

"ఏం చేయనమ్మా! నా ఖర్మ! పెళ్ళీడుగల కూతుళ్ళూ, చెట్టంత కొడుకులూ వున్నారా? ఈడు చెల్లుతూందా? అయినా ఆయనకా చెడుబుద్ధి వదల్లేదు. కంటపడిన ఆడవాళ్ళనందర్నీ అదేవరస! ఎన్నోసార్లు చీవాట్లూ చెప్పుదెబ్బలూ తినడం జరిగింది. అయినా, అంతే! ఏం చేయడం? ఎవరితో చెప్పుకోడం? కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. నాకు తెలుసు—మీామీద యీ అభాండం పడిందని. ఆయనతో చెప్పేను. ఆయన అంటారుగదా—"యింతమందిని చూసేనుగాని మీ కోడలులాటిదాన్ని చూడలే"దన్నారు.

"కొంప ముంచేక... ఏమనుకుంటే నేం? ఇంతకీ మా రోజులు బావులేవు. యిలా గయిందని, ఇప్పటికే మేం చస్తూంటే, మరో అభాండం వేస్తారేం పీకలమీదకి? కొడుకూ, కోడలూ యిలాంటివారని, దుమారం లేవదీసి, మా కుటుంబాన్ని కడుపునబెట్టుకుంటారా? చూడు, కోడలు ఎలా మారిపోయిందో—"

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూంది.

ఆ మీసాలరాయుడు పెళ్ళాం యింకా–

"ఇంకేం చెప్పేదమ్మా! మాపెద్దపిల్లకి... అయిదో నెల! ఉవ్వా!... చెప్పాగుంటే సిగ్గు సిగ్గు! ఇంక పెళ్ళి జరగాలా ?

"అయితే యిది మావాడిమీద తోస్తున్నారా? మీకు సిగ్గులేదూ!"

"మరింకెవడు? అతడే రోజూ చుట్టూతిరుగుతున్నాడు. దాన్ని అడిగితే బెల్లంకొట్టిన రాయిలా వూరుకుంటుంది..."

"...ఇంక చాలుగాని, నిజం తెలుసుకోకండా మావాడిమీద యీ పాపం పెట్టకండి. ఇంక మీరు వెళ్ళండి" అని ఆమెని పంపించేసేరు.

సుశీల అత్తగార్ని పట్టుకు ఏడ్వడం మొదలెట్టింది. 'నే ఛస్తానత్తా' అంటుంది. అత్తగా రూరుకోబెడుతూ 'వాడలాంటివాడు కాదే! నీకు తెలీదూ?' మన రోజు లిలా వున్నాయి. నీ కొచ్చినగతే వాడికీ వచ్చింది! నిజం తెలీక పోదు... వూరుకో!" అని ఓదార్చింది.

సుశీల ఏడుపుని పెదిమలలోనే అణుచుగుంటూ బాధ పడుతూంది. ఏ నిశ్చయానికీ రాలేకపోతూంది. నిజంగా తన భర్త అలాంటివాడా?– ఛా ఏమిటీ ఊహ... మరి తననికూడా అలాగే సందేహించి వుండడూ– ఇందులో నిజం ఎంత ? లోకంలో పోకడబట్టి – నిజానిజాలు ఎలా నిర్ణయించడం ? ఏమిటీ కుటుంబానికి యీ అపవాదులు, ఏమిటీ – అవమానం? వీటినికాదని, నిజం నిరూపించడం ఎలా ? తనలాంటి అమాయకురాలో తనభర్తకూడ అటువంటివాడే! ఈ నీలాపనిం

దల నెలా బాపుకుని, తలెత్తుకు తిరగడమో?—అని ఆమె వాపోతూంది.

ఇలాంటి సమయంలోనే స్వామి వచ్చేడు. నోటివరకూ వచ్చికూడ ఆమెగాని, అతని తల్లిగాని ఆ విషయం తెగించి అతనిముందు ఎత్తలేకపోయినారు.

ఇంట్లో కళకళలేదు, అందరూ ఏదో తప్పుచేస్తున్నట్లు, చేసినట్లు, మౌనంగా, ముభావంగా, నిర్జీవంగా మెసులుతున్నారు. అదోరకమయిన చీకటి అలుముకుంది.

తన హృదయంలోనిది భర్తకి చెప్పేసి, అన్నివిషయాలూ కడిగివేసి తన హృదయభారాన్ని దింపేసుకోవాలని అనుకుంది. ఇంట్లో చైతన్యాన్ని తేవాలని అనుకుంది. గాని ఆ సమయం రావాలిగాని వాళ్ళచేతుల్లో ఏముంది?

ఇద్దరూ ఎడం, ఎడంగానే గడిపేసేరు. ఆ మర్నాటి నుండి 'సుశీలమీద' ధుమారం కొంచెంతగ్గి, తాజావార్తగా ఆమెభర్త స్వామిమీద ధాటి ఎక్కువయింది. మీసాలవాడి కూతురుపేరు, యీతనిపేరు గోడలెక్కేయి. అయినాసరే, "స్వామి" చలించలేదు. మరింత నిఠారుగా తిరుగుతున్నాడు. అతని ప్రవర్తన, ధైర్యం, మొండితనం, యింట్లోవాళ్ళకే గాక లోకం అంతటికీ విడ్డూరంగా కనిపించింది. ఇంకేం చేయలేక "మొండిఘటాలు! సిగ్గుల్లేవు! ఆ యింటిదోవలంతే!" అని లోకం ఆఖరికి వుండబట్టలేక వాగుతూంది.

మీసాలవాడి కూతురి కడుపుతోసహా ప్రజల్లో గుసగుసలూ ఎక్కువవుతున్నాయి.

ఒకానొక శుభదినంనాడు 'సుశీల' ఇంటిముందు జనం

మూగేరు. నానా గోలా, అల్లరీ అవుతోంది. అందులో ముఖ్యపాత్రధారు డా మీసాలాయనే. ఆయన తల్లిగా మారబోతున్న తన కన్యకుమార్తెని తక్కిన సంసార సైన్యాన్ని వెంటబెట్టుకుని యీ చిన్నసంసారంమీద పడ్డాడు. కాని చక్కగా వియ్యం అడడానికే వచ్చేడు. యుద్ధంలో గెలిచి. 'సుశీల బయట'కి రాలేదు. ఆమెభర్త, అత్తగారు యివతల నిల్చున్నారు. వాళ్ళమాటలు పటాకీల్లా పేలుతున్నాయి.

"ఒరేయ్! పైకిరా? చీల్చేస్తా... ఏమిటో మర్యాదస్తుడివనుకున్నా. ఇదా? ఒంటరి ఆడపిల్లని అన్యాయం చేస్తావా?" అని మీసాలు మెలివేశాడు మీసాలాయను—

"నీ కొచ్చినవళ్ళు ఎవరికొచ్చాయి! మాపిల్ల బ్రతుకేం కావాలి? ఈ పాపం నువ్వే పోసుకో! ఇదిగో దీన్ని నువ్వే ఏలుకో" అని అతని భార్య—

"లేకపోతే పూరుకుందికి నేనేం! కోర్టు కెక్కించి బుజువుచేసి అంటగడతాను ఏమనుకున్నాడో" అని యీ విధంగా నలుగురూ అన్నారు. ఎగస్పార్టీవారిని జవాబు చెప్పనివ్వలేందే! తిరిగి— "ఏం అలా నిలబడతారు. కొయ్యల్లా! ముందుకొచ్చి మాటాడండి. లేకపోతే అటో యిటో యివాళ తేలిపోతుంది." అని అంటూ ఆ మీసాలవాడు కిందామీదా పట్టక 'సుశీల' భర్తని పట్టుకున్నాడు. ఇంతలో మూగిన ప్రజ ఆపి 'సంగతేమి'టని సావకాశంగా అడిగేరు.

"వాడినే చెప్పమనండి!" అని అరిచేరు వాళ్ళు—. అతడిప్రక్క తిరిగింది జనం, ప్రశ్నార్థకంగా.

స్వామితాపీగా—

"నాకు తెలీదండి—ఇంతవరకూ ప్రక్కింటికికామోసు జట్టీకి వచ్చేరని అనుకుంటున్నా. ఇప్పుడేకదా తెలిసింది నాతోనే అని—" అన్నాడు ఆమెభర్త ధీమాగా- వెటకారంగా.

"ఏమిటేమిటీ- విన్నారా! వీడి పొగరు!.. ఇదిగో యిది నా కుమార్తె... ఇంకా పెళ్ళికాలేదు... దీన్ని బుట్టలోవేసి, ఈ మహానుభావుడు చెడగొట్టాడు. ఇంక దీనికి పెళ్ళి ఎలాగవుతుంది? ఆయనే దీనిమొగుడు. ఏలుకుంటాడో, లేదో అని అడగడానికి వచ్చేం" అని ఈ విధంగా సిగ్గు లేకుండా నీచంగా చెప్పేసరికి—

జనం అంతా ముక్కుమీద వేలేసుగున్నారు. ఇంటి గుట్టు ఇంత భద్రంగా బయటపెట్టుతున్న ఆ ఆసామీ తెలివి తక్కువకి విచారిస్తూ.

"అమ్మో! తక్కువవాడుకాదురోయ్! పెళ్ళాం,వాడితో పోతే— వీడు వాడికూతురికే వేశేడు— ఘస్టు!" అని అంటున్నారు ప్రజ.

"కోర్టు కెక్కక ఇంకా చూస్తారేమండి!" అని సలహాలిచ్చేరు కొందరు.

"ఏం చెబుతావు పుణ్యాత్మా!" అని ప్రశ్నించారు కొంతమంది స్వామినిచూసి-

ఇహ జవాబు తప్పదని స్వామి—

"నేను నిజం చెబుతాను— మీ పిల్లకి మోసం జరక్కుండా చూస్తాను— కాని ఒక కండీషనుమీద" అని ఖచ్చితంగా అన్నాడు.

అప్పటికప్పుడే— ఆ వీధిలో జనంగాక— వూర్లో జనంకూడ కిక్కిరిసి టిక్కట్లు లేకండానే వినోదం చూస్తున్నారు.

ఆ ముక్క అత డనగానే అందరూ నిశ్చయించేశారు. "ఒప్పేసుకోక ఏం చేస్తాడ్రా!" అని.

అతని తల్లి, భార్యా గిచ్చుమన్నారు— ఇదేమిట్రా భగవంతుడా? ఇదొక ర్తి యింటిమీద? జాతి, కులం. మతం భ్రష్టమయిపోతుందా అని.

"ఏమిటా కండిషను! మా పిల్లకి భయం లేకపోతే— ఆ కండిషనుకి ఒప్పుకుంటాను!" అన్నాడా మీసాలరాయుడు. "అమ్మా! భగవద్గీత తే!" అన్నాడు 'స్వామి.' అతని తల్లి నిర్ఘాంతపోయి మాటాడకుండా తెచ్చియిచ్చింది. అందరూ సినీమాకన్న ఉత్సాహంగా చూస్తున్నారు. స్వామి యిలా అన్నాడు అందరిసమక్షంలోనూ.

"అయ్యా! అనగా మామీద దుమారాలు లేపిన, ప్రభృతులందరూ యిక్కడ వున్నారనే అనుకుంటాను. వారందరూ మహాజాగ్రత్తగా వినండి ఎందుకంటే మరో నిజమయిన దుమారం మీకు చెబుతున్నాను నిజంఅయితే మీ కక్కర్లేదు కాబోలు! అయినా యిలాంటి మహాసభకోసం, సందర్భంకోసం, నేను కాచుగొనివున్నాను.

ఈ మీసాలరాయలుంగారికి, నాభార్యకి సంబంధం వుందని లోకంలో బాజావాగడం అందరికీ తెలిసిందే. అందులో నిజానిజాలు యీయన యీ భగవద్గీతమీద ప్రమాణంచేసి జరిగింది జరిగినట్లు మీఅందరిముందూ చెప్పినట్లయితే—

ఆయన కూతురి కన్నెరికంలోగల గుట్టునే బుజువుచేసి చెబుతాను. ఈరోజు నా కుటుంబం తాలూకు పరువుప్రతిష్ట నాదగ్గరేవుందో, నడివీధిపాలే అయిందో, మీరే నిర్ణయించండి. ఇంతమట్టుకు వచ్చిందికాబట్టి సిగ్గూలజ్జా వదలి, మీముందే పెడుతున్నా."

అని గంభీరంగా నొక్కిచెప్పేడు. అతడలా అంటూంటే ఎవ్వరూ నోరెత్తలేక పోయినారు. మీసాలరాయుడివైపు తిరిగి "ఏమయ్యా సిద్ధమేనా? అని అడిగేను.

మీసాలరాయుని ముఖం ముడుచుకుపోయింది. అంత మనిషీ మూడంకెలంత చిన్నవాడై యితనిదగ్గరకువచ్చి—

"ఈభగవద్గీతేకాదు— నా పెళ్ళాం, పిల్లలమీదకూడ ప్రమాణంచేసి చెబుతున్నాను. తెలిసో తెలియకో ఆ యిల్లాలిని—అనగా ఈయన భార్యని— దారిలో అడ్డుకుంటూ పోకిరీ వేషాలు వేస్తూండడం నిజమే. కాని ఆమె ఏపాపం ఎరుగదు. నేచేసిన పాపానికి ఫలితం, నా సంతానంవల్లనే అనుభవిస్తున్నాను. ఆమెకీ నాకూ ఎలాంటి సంబంధం లేదు. ఆవిధమైన నాప్రవర్తనకి క్షమించమని ఆమెకు నమస్కారం చేస్తున్నాను" అని అందరికీ వింతపుట్టేటుగా అన్నాడు.

స్వామి ముందుకొచ్చి ప్రక్కింటి అమ్మలక్కల్ని ఉద్దేశించి "అమ్మా! మీరిలా ఊరుకుంటారా—మీలాటి ఆడదాని పరువు నట్టేట కలుస్తుంటే" అని అనేసరికి ఒకరిద్దరు కలిపించుకొని—

"అవును నిజమే. ఆమె నొక్కర్తినేకాదు, ఆదారంట వెళ్ళిన ప్రతి ఆడదాన్నీ యీతనలాగే భయపెట్టేవాడు."

అని సాక్ష్యంయిచ్చేరు. మీసాలరాయుడు తలదించుకున్నాడు. స్వామి మళ్ళీ మొదలుపెట్టేడు.

"ఒక్కటి ఋజువుచేసేను. ఇంకోటి వుంది. ఇదిగో ఏం అమ్మాయీ! యిలారా అని ఆ మీసాలరాయునికూతుర్ని పిలిచేడు. ఆమె వొణికిపోతూవచ్చి నిలుచుంది.

"నాతో సంబంధం వుందని మీవాళ్ళకి నువ్వే చెప్పావా?"

దాని కామె జవాబు చెప్పలేదు.

"చెప్పు ఫరవాలేదు. నీపరువు ఎలాగూపోయింది. నాపరువైనా కాపాడు. అది నీచేతిలోవుంది. ఒక్కవిషయం, నాపరువు నువ్వు కాపాడితే, నీజీవితం నేను కాపాడేతోవ చూపెడతాను."

ఈ మాటలు విని అందరూ ఆశ్చర్యపోయారు.

మీసాలరాయుని కూతురు జవాబుకు బదులు, ఏడ్వడం మొదలెట్టింది.

ఆమె తండ్రి, అతనూ, అందరూ బ్రతిమాలి బలవంతం చేయగా—

"లేదండి. మీరుకాదు, మీరుకాదు" అని యింక నిలుచోలేక, అక్కడే ఒక యింట్లోకి పారిపోయింది మొఖం చెల్లక.

ఆమాటలు వినగానే జనంఅంతా సలసల మరిగిపోయింది. హాహాకారాలు లేచేయి. మీసాలరాయుని అవస్థ అర్థంకాలేదు. పెద్దనమ్మకంతో యిలా పరువు నడివీధిలో పెడితే, యిలా తిరిగిందే అని నిర్జీవంగా, అవమానంతో

కృంగిపోయేడు. నిశ్చేష్టుడై నోటమాట రాక అలాగే కొయ్య అయిపోయినాడు.

"ఋజు వేమిటి?" అనే అపనమ్మకం ప్రశ్న వచ్చింది, ప్రజలోంచి.

"ఉంది"అని అంటూ స్వామి జేబులోంచి ఒకఫోటో తీసి, అందరికీ చూపెట్టేడు. అది ఆ మీసాలాయన కూతురూ ఆమె ప్రియుడూ కలిసివుంటూండగా, రహస్యంగా తీసినది.

"ఈ ఫోటోలు కోర్టులో ఋజూగాపెట్టి పెళ్ళిజరిపించండి" అని కూడ అన్నాడు.

"అదంతా అలా ముగియడం చూసి, అందరూ నోళ్ళు నొక్కుగున్నారు.

మీసాలరాయుడు; పరివారం అవమానం భరించలేక సిగ్గుతో తరలి వెళ్లిపోయినారు.

తిరగబడిన ప్రజ "కథ అడ్డం తిరిగిందే"అని తిరిగి వెళ్లిపోయేరు.

తెల్లగా తోమి కడిగేసిన మూకుడులో ప్రతిబింబం చూసుగొని లోకం పకపకా నవ్వుతుంది.